# ఇదీ ఓ లాటరీ కథ

"కంగ్రాచ్యులేషన్స్ వన్ ది లాటరీ వర్త్ టూ లాక్స్"

వణకుతున్న చేతులతో సంతకం పెట్టి, వణకుతున్న గొంతుతోనే టెలిగ్రామ్ చదివాడు కార్తీక్. మొదటిసారి తప్పు చదివానా అన్న సంశయం వచ్చి మళ్ళీ చదివాడు, మళ్ళీ చదివాడు. ఇప్పుడు కార్తీక్‌కి కళ్ళు గిర్రున తిరిగిపోతున్నై; భూమి, ఆకాశం ఏకమైన అనుభూతి. ప్రపంచంలో ఇంత అద్భుతం కూడా జరుగుతుందా! తనంతటి నిర్భాగ్యుడికింత అదృష్టమా! ఆఫ్టరాల్ తానొక గుమాస్తా. చిరిగిన చొక్కాలు కుట్టుకొని తొడుక్కునే సామాన్య ఉద్యోగి–ఓ పిల్లలకోడి. అట్లాంటి తానిప్పుడు భాగ్యలక్ష్మి విజేత.

పట్టరాని ఆనందం పగ్గాలు తెంచుకుంటుండే ఒక్క గావుకేక పెట్టాడు కార్తీక్. మరి ఏళ్ళ తరబడి గా లాటరీ టికెట్లు కొనడమే గానీ ఓ అయిదు రూపాయలన్నా వచ్చిన పాపాన పోలేదు.

శ్రీమతి ధనలక్ష్మి గాబరాగా పరుగెత్తుకొచ్చింది. అప్పటికే కార్తీక్ 'నేను లక్షాధికారిని' అంటూ నాట్యం చేస్తున్నాడు.

ఒక్క క్షణం ధనలక్ష్మికేమీ అర్థం కాలేదు. "ఏమిటండీ, మీకేమైందిః ఇట్లాకూర్చోండి" అంది భర్త చెయ్యి పట్టిలాగుతూ.

ఆ చెయ్యి విదిలించి పారేశాడు కార్తీక్. నువ్వెవరే నన్ను ఆజ్ఞాపించటానికి ? మామూలు గుమాస్తా ననుకుంటున్నావేమో నేనిప్పుడు లక్షాధికారిని ....అహ్హహ్హ" అంటూ ఒక్క దూకు దూకాడు. ధనలక్ష్మి బిక్కు బిక్కుమంటూ నిల్చుంది. పెళ్ళలు రాలి పడుతున్న గోడలవంక చూస్తూ.

అదే సమయానికి కార్తీక్ కొలీగ్ ప్రసాద్ వది రూపాయలో అప్పేమన్నా దొరుకుతుందేమో అని వచ్చాడు పొద్దున్నే.

ఎంత చెప్పినా వినిపించుకోని భర్తకు విషయం వివరించింది ధనలక్ష్మి. 'టెలిగ్రామ్ చూశావా దతను' ఆ రోజు తారీఖు చూడగానే స్ఫురించింది జరిగిందేమిటో. కానీ, ఏం చెప్పినా నమ్మే స్థితిలో లేడు కార్తీక్.

"కార్తీక్ ! ఆఫీస్ టైమైంది. పద" అన్నాడు.

"ఆఫీసా ? లక్షాధికారి కార్తీక్ ఆఫీసుకు రావడమా? ఆ బోడి ఆఫీసరు నన్ను చూస్తే మొహమాలిస్తాడు. నే నింక ఉద్యోగం చెయ్యను పో. బోడి ఆఫీసరు ముందు చేతులు నులుముకుంటూ నుంచోవాల్సిన అవసరం లేదు. అసలు నేను ఎవరితోనూ మాట్లాడను" అన్నాడు.

"ఆఫీసర్‌గారు నీకు కంగ్రాచ్యులేషన్స్ చెప్తారట రమ్మన్నారు..." అన్నాడు.

"ఆఁ! అయితే టాక్సీ పిలువు" అన్నాడు.

"టాక్సీలు మన వీధిలో దొరకవు. ఆటో పిలుస్తాను" అంటూ ఆటో తీసుకొచ్చాడు.

ఇంకా ఆఫీసుకి అప్పటికి చాలా మంది రాలేదు. ఆఫీసరు నిత్యానందం మాత్రం అరగంట ముందుగానే వచ్చేస్తాడు. ఆటోదిగి లోపలికి వెళ్ళిన తరువాత లాటరీ టెలిగ్రామ్ గురించి ఆయనతో చెప్పి, అనుభవజ్ఞుడైన ఆయనకి ఇతనితో ఎట్లా ప్రవర్తించాలో సూచనగా చెప్పి బయటికి వచ్చి కార్తీక్‌ని లోపలికి పంపించాడు ప్రసాద్. ఆకాశంలోకి చూస్తూనే ఆయన గదిలోకి అడుగు పెట్టాడు కార్తీక్.

"ఏమయ్యా! నీకేమన్నా బుద్ధుందా? కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకుని పని చెయ్యాలని తెలియదా? ఏమిటీ డ్రాఫ్టింగ్? అసలు ఈ ఫైలు ఎట్లా పుటప్ చేశావు? ఇట్లాంటి తప్పు ఈసారి కనబడిందంటే సస్పెండు చేస్తాను-జాగ్రత్త" అని ఒక్క ఉరుము ఉరిమాడు. కార్తీక్‌కి దిమ్మ తిరిగిపోయింది. ఏ మాట కామాటే చెప్పుకోవాలి. కార్తీక్‌కి ఆఫీసు పని విషయంలో ఎప్పుడూ చెడు రిమార్కు-లేదు. బాగా పని చేస్తాడనే పేరు ఉంది.

తన ప్రైజు, కంగ్రాచ్యులేషన్స్-ఇవేమీ లేకుండా ఇదేమిటి? ఒక్కసారి తాగినవ్వాడికి మైకం పోవడానికి రెండు బక్కెట్ల చన్నీళ్ళు నెత్తిన గుమ్మరించినట్లైంది. మత్తు దిగిపోయింది. ఆకాశం అంచుల్లోంచి నేల మీదికి దిగి వచ్చాడు.

"అది కాదు, సార్! నాకు....నాకు....లాటరీలో...." ఏదో చెప్పబోయాడు కార్తీక్.

"ఊ....లాటరీలో ప్రైజొచ్చిందా....ఇవాళ తారీకెంత?...."

"ఇవాళ....ఇవాళ...." అంటూ గోడకున్న కాలెండరు వేలు చూపి.... "ఇవాళ ఏప్రిల్.... ఫస్టు...." అన్నాడు. అతని కంఠంలో దుఃఖపు పొర కమ్ముకుంది. మనసు నిరాశగా నిట్టూర్చింది....

"ఆఁ.... ఏప్రిల్ ఫస్టున వచ్చే ఇటువంటి టెలిగ్రామ్ నమ్మకు-వెళ్ళు...." అన్నాడు నిత్యానందం కార్తీక్‌ని జాలిగాచూస్తూ. టెలిగ్రామ్ కూడా అతణ్ణి జాలిగాచూస్తుంటే ఆయన గదిలోంచి బయటికి వచ్చాడు కార్తీక్. అప్పటి కతని మత్తు పూర్తిగా వదిలిపోయింది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 4-9-'85)